# మరో సమిధ!



* రచన : శ్రీమతి పచ్చిగోళ్ళ సుధ *

(గతసంచిక తరువాయి)

ఆ లెటర్ చదివిన నాకు పిచ్చిపట్టినట్లయింది. నరనరాలు భయంతో వణుకుతున్నాయి! అడుగుపడటంలేదు! మాట పెగలడంలేదు! అలాగే కూలబడిపోయాను.

ఎప్పటికో ఈ లోకంలోకి వచ్చాను. కర్తవ్యం గుర్తొచ్చింది. 'అక్కను చూచి వస్తానంటూ' అమ్మతో చెప్పి బయలుదేరాను. హఠాత్తుగా బయలుదేరిన నన్ను చూచి అమ్మ ఏదో అడగబోయింది.

మరోటి అడిగే అవకాశం ఇవ్వకుండా అక్కడ్నుంచి వచ్చేశాను.

అక్కడకు చేరుకునేటప్పటికే అంతా అయిపోయింది. అక్క... అక్క నాకు లేదు. చివరి చూపులు కూడా నోచుకోలేకపోయాను. లోపల చాపమీద కళ్ళు తెరవని పసికందు ఏడుస్తోంది. బావ గోడకి ఆనుకుని నిలబడి వున్నాడు.

నాలో కోపం, పగ, ప్రతీకారం ఉవ్వెత్తున లేచాయి! బావ కాలర్‌పట్టుకుని ఆ చెంపా, ఈ చెంపా వాయించాను! అక్కడవున్న ప్రతివారూ వింతగా చూసేరే కాని, ఏమిటని అడుగలేదు.

బావతో ఏమీ మాట్లాడకుండానే పాపను తీసుకుని బయటికు వచ్చేసాను.

'ఆగు! పాపని ఎక్కడికి తీసుకుపోతున్నావ్?' అరిచాడు బావ!

'నాతో మా ఇంటికి!' దృఢంగా అన్నాను.

'ఎవడిచ్చాడు నీకీ అధికారం.'

'నీతో చంపబడ్డ నా అక్క!'

'కన్న తండ్రి వుండగా నువ్వు బిడ్డని తీసుకువెళతానంటే ఎవరొప్పుకుంటారు?'

'నువ్వొప్పుకోనేదేంటి? కట్టుకున్న భార్యను వున్నన్నిరోజులూ హింసించి, చివరికి చంపి, చేతులు దులుపుకున్న నువ్వు రేపు నీ కన్నబిడ్డని మాత్రం చంపవని నమ్మకం ఏమిటి?'

'నీ అక్కను ఎవరు చంపారు? డెలివరీ కష్టమయి అదే చచ్చింది.'

'అబ్బ! ఎంత అందమయిన అబద్ధం శభాష్! అయినా నీతో మాటలనవసరం. నీలాంటి రాక్షసుడి నీడలో నాచిట్టి తల్లి జీవించకూడదు అంతే!'

'కన్నతండ్రిని నేనుండగా ఆ బిడ్డను తీసుకెళ్లడం నీ తరంకాదు. నీకు అంతగా బిడ్డకావాలనుకుంటే నన్ను పెళ్ళాడు.'

'ఛీ! నీలాంటివాడితో నా పెళ్ళా?'

'ఏం నాకేం తక్కువ?'

'అన్నీ తక్కువే!'

'బాగా ఆలోచించుకో' అంటూ వెళ్ళిపోయాడు.

నేను రాత్రంతా ఆలోచించాను. అతనిమీద పగ సాధించడం కోసమయినా అతన్ని పెళ్ళిచేసుకుంటాను. నా చిన్నారి సరిగ్గా పెరగాలంటే, నా అక్క కోరిక తీరాలంటే,

అమాయకురాలయిన సుశీల కాదు ఈ స్వప్న అని తెలియాలంటే అతన్ని పెళ్ళిచేసుకోవాలి! ఇలా నిర్ణయించుకుని నా నిశ్చయం అమ్మకు చెప్పాను.

అక్క పోయినందుకు రాత్రింబవళ్లు తిండి, నిద్రమాని ఏడుస్తూనే వుంది అమ్మ! బావ చేసిన దారుణాలు ఆమెకు తెలియక మా పెళ్ళికి వెంటనే ఒప్పుకుంది.

అక్క ఈ లోకం వదలి నెలకూడా కాకుండానే మా పెళ్ళి జరిగిపోయింది. బావ మీసం దువ్వాడు విజయ గర్వంతో.

'ఆ రోజు పెళ్ళిచూపులకు నీ అందం, నీ దైర్యం చూసాను. అప్పటినుండి నిన్ను పొందాలన్న కోరిక అధికమయింది. ఇప్పటికి నిజమైంది.' అన్నాడు కళ్ళెగరేస్తూ.

'మిస్టర్ సుధాకర్! అప్పుడే నన్ను పొందినట్లు గర్వపడకు! నేను కేవలం ఈ పసిగుడ్డుకు తల్లిని మాత్రమే! బయటివారి దృష్టికి నేను నీ భార్యని! నన్ను తాకే హక్కు నీకులేదు! మితిమీరి ప్రవర్తిస్తే ఏం జరుగుతుందో...'

'నువ్వేం చెయ్యగలవ్...ఆడదానివి! ఇవాళకాకపోతే రేపయినా నా దారిన నడవవలసిన దానివి' అన్నాడు.

నేను మళ్ళీ ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఒక ఫ్రెండు సహాయంతో నాకు ఉద్యోగం దొరికింది, నా సంపాదనతో పాప, నేనూ రోజులు గడిపేస్తున్నాం.

బావ రోజురోజుకి దిగజారిపోయాడు. బాగా తాగి ఆడవాళ్ళను ఇంటికి తీసుకువచ్చి, చాలా దారుణంగా ప్రవర్తించేవాడు. అతనికి నేను లొంగలేదన్న కక్షతో నా కళ్ల ముందే పరాయి ఆడదాంతో అసభ్యంగా ప్రవర్తించేవాడు.

అతని అలవాట్లు మార్చాలని ఏ రోజు నేను ప్రయత్నించలేదు. పూర్తి పశువుగా మారిన బావను ఇక మనిషిగా మార్చటం నా వల్లకాదని తెలుసుకున్న నేను ఏ రోజు అతని దారికి అడ్డువెళ్ళలేదు!

బావను పెళ్ళిచేసుకుని, మరో అమ్మాయి జీవితాన్ని కాపాడగలిగాను. అమ్మకు నా పెళ్ళి సమస్యను తీర్చగలిగాను. పాపకు తల్లి ప్రేమ పంచగలిగాను.

పాపే లోకం అనుకున్నాను.

పాపకోసమే బ్రతుకుతున్నాను.

'అమ్మా...అమ్మా!' పరుగుతో వచ్చిన పాపను చూచి తన ఆలోచనలకు స్వస్తి చెప్పింది స్వప్న. స్వప్న కళ్ళ నుండి జారుతున్న నీటి బిందువులను శైలజ తన చిన్ని చేతులతో తుడిచింది.

స్వప్న శైలజను గుండెల్లో బంధించి రోదించింది.


1958 లో స్థాపించి రజతోత్సవం జరుపుకొన్న సంస్థ

**కావలెను**

మా ఫ్యాక్టరీలో తయారైన జంకాళాలు. మరియు బెడ్‌షీట్లు సిల్కు జంకాళాలు, పూలు జంకాళాలు, హాలు జంకాళాలు, డైనింగ్ హాలు జంకాళాలు ప్రసిద్ధి చెందినవి. వాటిని ప్రతివారూ మెచ్చుకుంటున్నారు, వీటికి ప్రతినిధిగానున్న వారు మంచి లాభము పొందుతున్నారు.

ఎల్. ఐ. సి. ఏజంట్లు, రిటైరయిన గవర్నమెంటు పనివారి నుంచి, వారు మంచి లాభం పొందుటకు దరఖాస్తులు కోరబడుచున్నాము.

: తయారుచేయువారు :

Phone : 2069

**J. P. M. Textiles**

Post Box No. 60 : : BHAVANI - 638 301.